ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సూర్యాపేట

5

బుధవారం 4 సెప్టెంబరు 2024

గరిష్ఠం 28.0
కనిష్ఠం 23.4

**

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	585.90 (300.3015)	3,37,687	3,16,516
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.20 (3.74)	6,277	1,244
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.21 (41.54)	4,07,855	4,35,518

చికెన్ ధరలు	లైవ్ : రూ.125	డ్రెస్ : రూ.180	స్కిన్‌లెస్ : రూ.210



ఈ నష్టం తీరనిది

▸ భారీ వర్షాలు, వరదలకు చెరువులకు గండ్లు ▸ జిల్లా వ్యాప్తంగా దెబ్బతిన్న పంటలు ▸ ధ్వంసమైన రోడ్లు

భారీ వర్షాలు, వరదల కారణంగా జిల్లాలో అపార నష్టం వాటిల్లింది. ప్రధానంగా కోదాడ, హుజూర్‌నగర్ డివిజన్‌లో నష్టం అధికంగా ఉంది. వరద ఉధృతికి పంట పొలాల్లో ఇసుక మేటలు వేయడం తో దెబ్బతిన్నాయి. మేళ్లచెర్వు మండలవ్యాప్తంగా వరి 800ఎకరాలు, పత్తి600 ఎకరాలు, చింతలపాలెం మండలంలో వరి 300ఎకరాలు, పత్తి 505 ఎకరాలు, మిర్చి 355 ఎకరాల్లో పూర్తి దెబ్బతిన్నది. పాలకవీడు మండలంలో విద్యుత్‌శాఖకు రూ.50లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. వేములూరి వాగుపై చెర్వు కట్టలు తెగడంతో వరదకు 50 విద్యుత్ స్తంభాలు, 10 ట్రాన్స్‌ఫార్మర్లు, 5 కిలోమీటర్ల మేర విద్యుత్ తీగలు ధ్వంసమయ్యాయన్నారు. నూతన్‌కల్ మండలంలోని అలుగునూరు గ్రామానికి ఒకే రహదారి ఉండగా, అది కూడా వరదలకు కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచాయి ఆత్మకూర్(ఎస్) మండలంలోని బొప్పారంతండాలో 10 విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో వ్యవసాయ మోటార్లకు మూడు రోజుల నుంచి విద్యుత్ సరఫరా నిలిచింది. తుంగతుర్తి మండలంలోని కేశవాపురం వద్ద ఉన్న బంధం వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో గ్రామం నుంచి వెలుగుపల్లి మధ్య రాకపోకలు నిలిచాయి. కేశవాపురం గ్రామానికి చెందిన ఒకరికి తేలు కుట్టగా, చికిత్స నిమిత్తం స్థానికులు కర్ర కావలికి జోల కట్టి అతడిని బంధం వాగును దాటించి తుంగతుర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. నేరేడుచర్ల మండలంలోని గంటవారిగూడెం నుంచి నేరేడుచర్ల కు వచ్చే రహదారి పూర్తిగా ధ్వంసమైంది.

– (ఆంధ్రజ్యోతి,సూర్యాపేట)

•8లో

నెమ్మదించిన వరుణుడు

సూర్యాపేటటౌన్: బంగాళఖాతంలో అల్పపీడన ప్రభావంతో ప్రతాపం చూపిన వరుణుడు కాస్త నెమ్మదించాడు. దీంతో జిల్లా ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. మంగళవారం జిల్లాలోని పలు మండలాల్లో చిరుజల్లుల వర్షం కురిసింది. జిల్లాలో 2.1 మి.మీ.ల సగటు వర్షపాతం నమోదుకాగా, అత్యధికంగా మునగాలలో 9.7మి.మీ, అత్యల్పంగా పెన్‌పహాడ్‌లో 0.5మి.మీ వర్షం కురిసింది. వరుస వర్షాలతో పత్తితోపాటు ఆరుతడి, కూరగాయలు, వరి పంటలకు జీవం పోసినట్టయింది. భూగర్భజలాలు కూడా పెరగనున్నాయి. జిల్లా కేంద్రంలోని సద్దుల చెరువు అలుగు పోసింది. పుల్లారెడ్డి చెరువు, నల్లచెరువులు నిండు కుండను తలపిస్తున్నాయి. భారీ వర్షాలు, వరదల కారణంగా మేళ్లచెర్వు మండలంలో ఇసుక మేటలు వేసి పొలాలు దెబ్బతిన్నాయి. ఏపుగా ఎదిగిన పత్తి, పూత, కాయ దశలో నీటిలో నాని, మేటలు వేయడంతో రైతులకు తీవ్ర నష్టం మిగిల్చింది.



సూర్యాపేట జిల్లా కేంద్రంలో అలుగుపోస్తున్న సద్దుల చెరువు

ఇది ప్రభుత్వం సృష్టించిన విలయం

▸ మాజీ మంత్రి జగదీ‌శ్‌రెడ్డి ▸ ఎడమకాల్వకు గండిని పరిశీలించిన బీఆర్‌ఎస్ మాజీ మంత్రుల బృందం



ఎడమకాల్వకు గండితో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న మాజీ మంత్రులు హరీ‌శ్‌రావు, జగదీ‌శ్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, తదితరులు

నడిగూడెం, సెప్టెంబరు 3: నడిగూడెం వద్ద ఎడమ కాల్వకు గండి పడటం, పంటలు కొట్టుకుపోవడం ప్రకృతి సృష్టించిన విలయం కాదని, ఇది ప్రభుత్వం సృష్టించిన విలయమని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీ‌ష్‌రెడ్డి ఆరోపించారు. మాజీ మంత్రి హరీ‌ష్‌రావు నేతృత్వంలో బీఆర్‌ఎస్ శాసనసభ్యులు, మాజీ మంత్రుల బృందం నడిగూడెం మండలం కాగిత రాంచంద్రాపురం వద్ద రెండు చోట్ల గండి పడిన ప్రదేశాలను మంగళవారం పరిశీలించింది. ఈ సందర్భంగా జగదీ‌ష్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం సృష్టించిన విలయం కారణంగా రైతులు పంట నష్టపోవడమేగాక, మరో రెండు పంటలు సాగుచేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇక్కడి రైతులు తమ పొలాలను బాగుచేస్తే చాలు, ఎలాంటి డబ్బు అవసరం లేదని ఆవేదన వ్యక్తం చేశారని అన్నారు. ఆపత్కాలంలో రాజకీయాలు చేయాల్సిన అవసరం తమ పార్టీకి లేదన్నారు. ప్రజలకు ధైర్యం చెప్పాల్సిన ముఖ్యమంత్రి రెండు రోజులు పత్తా లేకుండాపోయి తన తప్పును దాచిపెట్టుకునేందుకు కేసీఆర్‌పై, బీఆర్‌ఎస్‌పై విమర్శలు చేశారన్నారు. చావుకు కూడా తేడా తెలియని పరిస్థితిలో ముఖ్యమంత్రి ఉన్నారని, ఓదార్పు కొచ్చారో సంబరాలకు వచ్చారో ఆయనకు అర్థం కావడం లేదన్నారు. సాగర్ ఎడమ కాల్వ కట్ట దెబ్బతినడానికి ప్రధానమైన కారణం ప్రభుత్వమేనని, రైతులు కూడా ఆధారాలు చూపిస్తున్నారన్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రులు నీళ్ల తీసుకుపోయేందుకు కాల్వ కట్టపై పోలీసులను పెట్టి తూములు మూసివేసి గేట్లకు వెల్డింగ్ చేసి నీళ్ల పోకుండా చేశారన్నారు. గేట్లకు వెల్డింగ్ చేయడంతోనే కట్ట కొట్టుకుపోయిందని అన్నారు. తొమ్మిది గంటలు సహాయం కోసం ఎదురుచూస్తున్న బాధితులను కాపాడడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. చీకటిపడ్డాక కాంగ్రెస్ పార్టీ మంత్రులు మొసలి కన్నీళ్ల కార్చి ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేశారన్నారు. ప్రజలను గాలికి వదిలేసి ముఖ్యమంత్రి, మంత్రులు జల్సాల్లో మునిగితేలుతున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, వివేక్ గౌడ్, ఎమ్మెల్సీ షంబీపూర్ రాజ్, రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు బొల్లం మల్లయ్యయాదవ్, గాదరి కిశోర్, చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రులకు ఘన స్వాగతం

సూర్యాపేట(కలెక్టరేట్): వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించేందుకు వచ్చిన మాజీ మంత్రులు హరీ‌ష్‌రావు, సబితాఇంద్రారెడ్డికి పార్టీ శ్రేణులు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఘనస్వాగతం పలికాయి. స్వాగతం పలికిన వారిలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్, మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, నాయకులు వై.వెంకటేశ్వర్లు, వెంకటనారాయణగౌడ్, నిమ్మల శ్రీనివాస్ గౌడ్, పుట్టా కిశోర్‌కుమార్, జీవన్‌రెడ్డి, జీడి భిక్షం, నెమ్మాది భిక్షం, మర్ల చంద్రారెడ్డి, కొణతం సత్యనారాయణరెడ్డి, తూడి నర్సింహారావు, దొంగరి యుగంధర్, గుర్రం సత్యనారాయణరెడ్డి, తాహేర్‌పాష, లవకుశ, జానీయాదవ్, నాగయ్యగౌడ్, సల్మా, కరుణశ్రీ, మహేశ్వరి, ఉన్నారు.



భారీ విపత్తును ఎదుర్కొనేందుకు కృషి

▸ వర్షాలతో దెబ్బతిన్న చెరువులు, కుంటలకు మరమ్మతులు చేయాలి

▸ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్, సెప్టెంబరు 3: రాష్ట్రంలో ఏర్పడిన భారీ విపత్తును ఎదుర్కొనేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్ పట్టణంలోని మట్టపల్లి బైపాస్‌రోడ్డు, సింగారం రోడ్డు, గోవిందాపురం కల్వర్టు, శివాలయం వీధి, మినీ ట్యాంక్‌బండ్, దద్దనాల చెరువు కాలనీ, సహకార సంఘంలో తడిసిన ఎరువులు, దెబ్బతిన్న ఇళ్లు, రోడ్లు, పంటలను పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. వరద బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పంట నష్టపోయిన రైతులకు అండగా ఉంటామన్నారు. పాక్షికంగా ఇళ్లు దెబ్బతిన్న వారికి రూ.10వేలు సహాయం అందజేస్తామన్నారు. పంటనష్టంపై అధికారులు అంచనా వేయాలన్నారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సమగ్ర సర్వే చేయాలన్నారు.

నియోజకవర్గంలో చెరువులు, కుంటలు దెబ్బతినగా సీఎం మంజూరు చేసిన నిధులతో వెంటనే వాటికి మరమ్మతులు చేయాలన్నారు. ప్రజల కష్టాలను తెలుసుకునేందుకు రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అనంతరం హుజూర్‌నగర్ మండలం బూ రుగడ్డ గ్రామంలోని నల్లచెరువుకు గండి పడిన ప్రదేశాన్ని పరిశీలించారు. పంట పొలాల్లో ఇసుక మేటలు వేయగా వాటిని పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో తన్నీరు మల్లికార్జున్‌రావు, దొంతగాని శ్రీనివాస్, కోతి సంపత్‌రెడ్డి, గూడెపు శ్రీను, ఆర్డీఓ శ్రీనివాసులు, కమిషనర్ యాకోబ్, అమర్‌నాథ్‌రెడ్డి, సాముల శివారెడ్డి, వేములనాగరాజు, వరలక్ష్మీ, కొమ్ము శ్రీను, సతీష్, భాస్కర్, సైదాకృష్ణ, మన్సూర్‌అలీ, మహే‌ష్‌గౌడ్, ఈడ్పుగంటి సుబ్బారావు, అరుణ్‌కుమార్, ఏఈ తుమ్మల శ్రీనివాస్, గూడెపు అనిల్‌కుమార్, సిద్ధార్థరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటిపారుదల శాఖ ఏఈని సస్పెండ్ చేయాలి

హుజూర్‌నగర్ నీటిపారుదల శాఖ ఏఈ తుమ్మల శ్రీనివా‌స్‌ను సస్పెండ్ చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సీఈ రమే‌ష్‌బాబును ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని మినీ ట్యాంక్‌బండ్‌ను పరిశీలించిన అనంతరం జిల్లా చీఫ్ ఇంజనీర్‌తో ఫోన్‌లో మాట్లాడి సస్పెండ్‌కు ఆదేశాలు జారీచేశారు. హుజూర్‌నగర్‌లోని ట్యాంక్‌బండ్‌ను తప్పుడు ప్రణాళికతో నిర్మించి వరదకు కారణమైన ఏఈని సస్పెండ్ చేయాలన్నారు. ట్యాంక్‌బండ్ నిర్మాణ సమయంలోనే ప్లానింగ్ మార్చాలని చెప్పినప్పటికీ వరద నీటిని చెరువులో నుండి కాలువ ద్వారా శివాలయం వీధిలోకి వదలడంతో శివాలయం, గంగమ్మ దేవాలయం, గోవిందాపురం రోడ్డులోని ఇళ్లన్నీ మునిగాయని మంత్రి ఉత్తమ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఏఈపై ఆగ్రహం వ్యక్తంచేసిన మంత్రి సీఈని సస్పెండ్ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శివాలయం బజారులో 7వ వార్డులో ఉన్న ట్యాంక్‌బండ్‌ను సక్రమంగా లేకపోవడం వల్లే వరద తీవ్రతకు ఇళ్లల్లోకి నీరు వచ్చిందన్నారు. చెరువుకట్టకు సాధ్యమైనంత వరకు మరమ్మతులు చేయాలన్నారు. ఇదిలా ఉండగా సహకార పరపతి సంఘం గోదాంలో నీళ్ల వచ్చే వరకూ ఏం చేస్తున్నారని సీఈవో నరేందర్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. గోదాంలోకి వర్షపు నీరు ఎలా వచ్చిందని, రోడ్లు కూడా లోతట్టుగా ఉన్నాయని ఆగ్రహం చెందారు.

చెరువు నీటిని ఊళ్లోకి వదిలారు

చెరువులోని నీళ్లన్నీ వచ్చి ఇళ్లు మునిగి వరదతో కూలిపోయాయి. గత ప్రభుత్వం ఇష్టానుసారంగా వందల ఎకరాల చెరువులోని నీటిని ఊరి మీదకు మళ్లించింది. వద్దన్నా గత ప్రభుత్వంలోని పెద్దలు ఇళ్ల మధ్య నుంచి కాల్వలు తీశారు. వందల ఏళ్ల చరిత్ర ఉన్న చెరువుకు పడర వైపు కాల్వ పెట్టి చెరువు నీళ్లను ఊరి మీదకు వదిలి పెట్టారని హుజూర్‌నగర్ పట్టణంలోని శివాలయం వీధిలో నివసిస్తున్న ప్రజలు మంత్రి ఉత్తమ్ ఎదుట తమ ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ స్వల్పంగా ఇళ్లు కోల్పోయిన వారికి రూ.10వేలు, మొత్తం ఇళ్లు కోల్పోయిన వారికి రూ.5లక్షలు ఇంటి నిర్మాణానికి ఇస్తానని హామీ ఇచ్చారు. అధికారుల తప్పిదంవల్లే చెరువులోని వరదనీరు ఇళ్లలోకి వచ్చిందన్నారు. సంబంధిత ఏఈని సస్పెండ్ చేస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ ప్రకటించారు.

చెరువులు, కాల్వలపై ఆక్రమణలు తొలగించండి

హుజూర్‌నగర్ ప్రాంతంలోని చెరువులు, కాల్వ కట్టలపై ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. పట్టణంలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయానికి సమీపంలోని బైపాస్ రోడ్డులో గల కాల్వలు, తెగిపోయిన రోడ్లను మంత్రి పరిశీలించి ఆక్రమణలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రతీ ఒక్కరిని ఆదుకుంటాం

మఠంపల్లి: మండలంలో చెరువు కట్టలకు గండి పడి నష్టపోయిన రైతులను, ఇళ్లు కూలిపోయిన బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. మఠంపల్లి మండలంలోని చౌటపల్లి ఊర చెరువు, అలుగు, మఠంపల్లి ఎస్సీకాలనీలో బాధిత కుటుంబాలను, రఘునాథపాలెం గ్రామంలో ముంపునకు గురైన కాలనీ, ధ్వంసమైన రోడ్డు, గుండ్లపల్లి, చౌటపల్లి లిఫ్టును, మామిళ్ల చెరువుకు పడిన గండిని, చెన్నాయిపాలెం వద్ద వరద ప్రవాహంలో కొట్టుకుపోయిన పంట పొలాలు, కల్వర్టులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గత 50 ఏళ్లలో పడని వర్షాలు కురిశాయన్నారు. వారంలోగా మరమ్మతు పనులు చేపడ్తామన్నారు. ఆయన వెంట హుజూర్‌నగర్ ఆర్డీవో శ్రీనివాసులు, నీటి పారుదల శాఖ డీఈ స్వామి, తహసీల్దార్ మంగారాథోడ్, మాజీ ఎంపీపీ అప్పయ్య, నాయకలు భూక్యమంజూనాయక్, ఆధూరి కిషోర్‌రెడ్డి,గుండా బ్రహ్మారెడ్డి, సింగారపు సైదులు ఉన్నారు. సాగర్ సిమెంట్స్ ఆధ్వర్యంలో మఠంపల్లి ఎస్సీ కాలనీకి చెందిన సుమారు 120మంది ముంపు బాధితులకు సమకూర్చిన బియ్యం, నిత్యావసరాలను మంత్రి ఉత్తమ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పరిశ్రమ అధికారులు హరిదాస్, తుడి వెంకటరెడ్డి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

హైడ్రాను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించాలి

వరదలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

సూర్యాపేటఅర్బన్, సెప్టెంబరు 3: హైడ్రాను కేవలం హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా రాష్ట్రవ్యాప్తంగా విస్తరింపజేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సీపీఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో చెరువులు, కుంటలు ఆక్రమణను గురయ్యాయని, వాటిని వెలికితీసేందుకు రాష్ట్రవ్యాప్తంగా అన్నిగ్రామాల్లో హైడ్రాను ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా ఈ నెల 10 నుంచి 17వరకు రాష్ట్ర వ్యాప్తంగా సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని తెలిపారు. వరదల వల్ల నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలన్నారు. గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వాటి నివారణకు తాత్కాలిక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి మాట్లాడుతూ అంటువ్యాధులు, విషజ్వరాల నుంచి ప్రజారోగ్యాన్ని రక్షించేందుకు రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెంగీ వల్ల మృతిచెందిన కుటుంబానికి ప్రభుత్వం రూ.10లక్షల ఎక్స్‌గ్రేసియా చెల్లించాలని డిమాండ్‌చేశారు. అనంతరం పార్టీ జెండాను సీపీఎం సీనియర్ నాయకుడు జుట్టుకొండ వీరయ్య ఎగురవేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు నగారపు పాండు, జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, జిల్లాకార్యదర్శివర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరి, పారెపల్లి శేఖర్‌రావు, మేదరమెట్ల వెంకటేశ్వర్‌రావు, మట్టిపల్లి సైదులు, చెరుకు ఏకలక్ష్మీ, కోట గోపి పాల్గొన్నారు.



నాటి జాగరూకత.. నేటి గుండెకోత

- ఖమ్మం జిల్లా తాగునీటి అవసరాలకు సాగర్ నీరు
- ఏప్రిల్‌లో తూములకు వెల్డింగ్ చేసి నీటి తరలింపు
- ఆ తర్వాత వాటిని తీయడంలో అధికారుల నిర్లక్ష్యం
- కాల్వలో నీటి ఉధృతికి రెండు చోట్ల గండ్లు
- సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలంలో 2 వేల ఎకరాల్లో పంట నష్టం



7



హైకోర్టు చెప్పినా అందని అర్చకుల వేతనాలు

- పట్టించుకోని దేవాదాయశాఖ అధికారులు

7

ఆర్టీసీ బస్సులో ఆగిన గుండె

వైద్యం కోసం ఆస్పత్రికి వెళ్తుండగా ఘటన

•7లో..

విద్యుదాఘాతానికి ముగ్గురు మృతి

టెన్నిస్‌కు వయస్సు అడ్డుకాదంటూ...

భువనగిరి టౌన్, సెప్టెంబరు 3 : ఐటీఎఫ్ వరల్డ్ మాస్టర్ టూర్-100 సీనియర్ టెన్నిస్ టోర్నమెంట్ యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో ఉత్సాహంగా కొనసాగుతోంది. క్రీడాకారులు గెలుపుకోసం మైదానంలో చెమటోడుస్తున్న తీరు అబ్బురపరుస్తోంది. 30 నుంచి 75సంవత్సరాలు పైబడిన 10 కేటగిరీల్లోని స్త్రీ, పురుషుల సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ సుమారు 100మంది వెటరన్ క్రీడాకారులు పోటీపడుతున్నారు. చివరి రోజైన బుధవారం పలు కేటగిరిలలో ఫైనల్స్ జరుగనున్నాయి.



● ఒకరి వెంట మరొకరుగా



వాసుదేవరెడ్డి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పైగా టెన్నిస్ క్రీడాకారుడు. భార్య సునీత గృహిణి.వాసుదేవరెడ్డి ఉద్యోగం నుంచి రాగానే రాకెట్ పట్టుకుని టెన్నిస్ కోర్టుకు వెళ్లేవాడు. ఓ రోజు భర్తతో పాటు సునీత టెన్నిస్ కోర్టుకు వెళ్లింది. ఈ క్రమంలో ఆమె కూడా ఆటలో ప్రావీణ్యం పొందింది. దీంతో భార్యాభర్తలిద్దరూ మిక్స్‌డ్ డబుల్స్ ఆడుతూ టెన్నిస్ దంపతులుగా పేరుగాంచారు. పలు విజయాలు సాధించారు. వారి పిల్లలిద్దరు కూడా టెన్నిస్ ఆడుతూ రాణిస్తుండటంతో కుటుంబంలో టెన్నిస్ ఓ భాగమైంది. వారి ఇంటి నిండా రాకెట్స్, బాల్స్, ట్రోఫీలు ఉంటాయని ఆ దంపతులు తెలిపారు.

కూతురు కోసం వెళుతూ..



నా కుమార్తె సాహిత్యకు టెన్నిస్ అంటే చాలాఇష్టం. ప్రస్తుతం ఆమె కృష్ణ యూనివర్సిటీ క్లబ్ మెంబర్. అయితే క్రీడాకారులు అందుబాటులో లేని సమయంలో ఆమె ఒంటరిగా టెన్నిస్ ఆడేది. దీంతో ఆమెను ప్రోత్సహించేందుకు నేను ప్రత్యర్థిగా మైదానంలో ఆడేదానిని. క్రమంలో నేనూ టెన్నిస్ క్రీడాకారిణిగా ప్రతిభ చూపే స్థాయికి ఎదిగా. ప్రస్తుతం నా వయస్సు 49 ఏళ్లు. ఇప్పటివరకు పలు పతకాలు సాధించా.గతంలో జర్నలిజం వృత్తిలో ఉన్న, ప్రస్తుతం హైదరాబాద్ యూనివర్సిటీలో హిందీ విభాగంలో పనిచేస్తున్నా.

శ్రీ జ్ఞానమూర్, హైదరాబాద్.

టెన్నిస్‌కు వయస్సు అడ్డంకి కాదు



ప్రస్తుతం నా వయస్సు 77 ఏళ్లు. 14 ఏళ్ల వయసు నుంచే ఆడుతున్నా. మా ఇంట్లో నాలుగు తరాలు కలిసి టెన్నిస్ ఆడుతుంటాం. మా అందరి ఆరోగ్య రహస్యం టెన్నిస్ ఆడటమే. వెటరన్ టెన్నిస్ సిరీస్‌లో 75 సంవత్సరాల విభాగంలో 2023లో స్పెయిన్, 2024లో టర్కీ, కోల్‌కతాలో ఇండియా తరఫున ఆడా. శరీరం సహకరించినంత వరకు ఆడుతుంటా. అలాగే విజయవాడలోని సొంత క్లినిక్‌లో నేటికీ వైద్యుడిగా కొనసాగిస్తున్నా.

- డాక్టర్ సూదగాని రామకృష్ణ, విజయవాడ.

జాతీయస్థాయి పోటీలు హర్షనీయం

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 3 : నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో జాతీయస్థాయి కరాటే, కుంగ్‌ఫూ పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఈ నెల 29 నుంచి మొదలయ్యే పోటీలకు సంబంధించిన కరపత్రాలను ఆయన మిర్యాలగూడలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆర్గనైజింగ్ ఫౌండర్ బూడిద సైదులు, కరాటే మాస్టర్ బానావత్ రామకృష్ణనాయక్ మాట్లాడుతూ పోటీలకు దేశం నలుమూలల నుంచి నుంచి 1000 మంది క్రీడాకారులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో నూకల వేణుగోపాల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



కరపత్రం విడుదల చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

నేటి నుంచి రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 3: రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నేటి నుంచి నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కోచ్ తోట రంగారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ప్రశాంత్ తెలిపారు. డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహించే అండర్-11 బాలబాలికల పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 200మంది క్రీడాకారులు హాజరుకానున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్టేట్ అసోసియేషన్, డిస్ట్రిక్ట్ అసోసియేషన్ సంయుక్తంగా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో కోచ్ మారబోయిన రామకృష్ణ, డాక్టర్ అంజయ్య, నవీన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు చెప్పినా అందని అర్చకుల వేతనాలు

దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ వేణుగోపాలస్వామి దేవాలయ అర్చకులకు శాపంగా మారింది. తాతల పేరు మీద ఉన్న భూములను దేవాదాయ శాఖకు రిజిస్ట్రేషన్ చేయాలని అధికారులు వేతనాలు నిలిపివేశారు. తమకు జరిగిన అన్యాయంపై అర్చకులు హైకోర్టును ఆశ్రయించి వేతనాల కోసం ఆదేశాలు పొందినా తీర్పును అమలు పర్చడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఐదేళ్ల న్యాయపోరాటంతో ఐదు నెలల కిందట తమకు అనుకూలంగా తీర్పు వచ్చినా వేతనాల కోసం ఎదురుచూడక తప్పడం లేదు.

- హుజూర్‌నగర్

● పట్టించుకోని దేవాదాయ శాఖ అధికారులు
● ఇబ్బందుల్లో హుజూర్‌నగర్ సీతారామచంద్రస్వామి ఆలయ అర్చకులు



సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయం, శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయాలు వేర్వేరుగా ఉన్నాయి. వేణుగోపాలస్వామి ఆలయం పట్టణంలో ఉండగా, సీతారామచంద్రస్వామి ఆలయం ఐదు కిలోమీటర్ల దూరంలోని ఫణిగిరిగట్టుపై ఉంది. 2009 వరకు ఈ ఆలయాలు రికార్డుల్లో వేర్వేరుగా ఉన్నాయి. ఆ తర్వాత ఆలయానికి సంబంధించిన పాలకవర్గాలు, అధికారులు కలిసి రెండు ఆలయాలను ఒకటిగా చేశారు. అప్పటి నుంచి ఫణిగిరిగట్టుపై స్వయంభువుగా వెలిసిన శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ఉత్సవవిగ్రహాలను పట్టణ నడిబొడ్డున ఉన్న శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో వేంచేయిస్తున్నారు. ఈ సాకుతోనే రెండు దేవాలయాలను విలీనం చేశారని సమాచారం.

మస్కృతి ఇనాం భూములుగా రికార్డుల్లో నమోదుతో..

శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయానికి 627 ఎకరాల భూమి ఉండగా, శ్రీవేణుగోపాలస్వామి దేవాలయానికి 55ఎకరాల భూమి ఉంది. రెండు ఆలయాలకు కలిపి ప్రస్తుతం వారసత్వంగా నరగిరినాథుని భాస్కరాచార్యులు, నరగిరినాథుని మురళీచార్యులు, నరగిరినాథుని నర్సింహాచార్యులు, రంగభట్రాచార్యులు అర్చకులుగా కొనసాగుతున్నారు. దశాబ్దాల కిందట నరగిరినాథుని మురళి, నర్సింహాచార్యులు, భాస్కరాచార్యుల తాత, ముత్తాల కాలంలో మస్కృతి ఇనాం సర్వీస్ భూములను కొంత ఇవ్వగా అప్పుడు రికార్డుల్లో తాతల పేర్లు నమోదుచేశారు. శ్రీవేణుగోపాలస్వామి దేవాలయానికి సంబంధించి అర్చకులుగా(దశాబ్దాల కిందట) పనిచేసిన వారి పేరు మీద 43 రిజిస్ట్రేషన్‌లో 55 ఎకరాల భూమి ఉన్నట్లుగా రికార్డుల్లో తప్పుగా నమోదు చేసినట్లు సమాచారం. వాస్తవంగా అర్చకులు, స్థానాచార్యులు వేర్వేరుగా ఉన్నారు. కానీ స్థానాచార్యులకు సంబంధించిన భూములు సైతం అర్చకుల పేరు మీద పెట్టి 43 రిజిస్ట్రేషన్‌లో పొందుపర్చినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

ఐదేళ్లుగా వేతనాలు నిలిపివేత

2013 నుంచి రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రస్తుత అర్చకులకు నామమాత్రపు వేతనాన్ని చెల్లిస్తుండేది. ఆ తర్వాత 2018 వరకు దేవాలయానికి వచ్చే ఆదాయం నుంచి నెలకు రూ.6,500లు అందించారు. అనంతరం 2018 నుంచి 2019 వరకు ఎండోమెంట్ శాఖ ప్రతి నెలా ఒక్కొక్కరికి రూ.22వేల చొప్పున వేతనాలు అందించారు. కాగా 2019 నుంచి నేటి వరకు అర్చకులకు వేతనాలు చెల్లించడం లేదు. ఆలయాలను మిళితం చేసే సమయంలో అర్చకుల పేరు మీద 43 రిజిస్ట్రేషన్‌లో పేర్కొన్న భూములను దేవాదాయ శాఖకు బదలాయించాలంటూ 2019నుంచి అర్చకులకు వేతనాలు నిలిపేశారు. ఇదిలా ఉండగా దేవాదాయ శాఖ రిజిస్ట్రేషన్ చేయాలంటున్న భూమిలో 20ఏళ్ల కిందట కొంత మంది వ్యక్తులు సర్వే నెంబర్లు మార్చి సుమారు 20 ఎకరాలను విక్రయించారన్న ఆరోపణలు ఉన్నాయి. కాగా మిగిలినభూములు అర్చకుల పేరు మీద ఉన్నాయంటూ తప్పుడు రికార్డులు రాశారని అర్చకులు మురళి, భాస్కరాచార్యులు, నర్సింహాచార్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవాదాయ శాఖ అధికారులు వేతనం నిలిపివేయడంపై ముగ్గురు 2019లో హైకోర్టును ఆశ్రయించారు. ఐదేళ్లుగా కొనసాగిన విచారణలో భాగంగా అర్చకులకు గతంలో ఇచ్చిన వేతనాల మాదిరి చెల్లించాలని 2023 డిసెంబరులో తీర్పును కోర్టు రిజర్వ్ చేసింది. అనంతరం ఈ ఏడాది మార్చిలో వేతనాలు చెల్లించాలని మరోసారి సింగిల్ బెంచ్ తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును ఎండోమెంట్ కమిషనర్‌కు అందజేసినా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని అర్చకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఐదేళ్లుగా అర్చకులకు వేతనాలు చెల్లించకపోవడంతో తమ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అర్చకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భూములు ఇస్తామన్నా..

ఇదిలా ఉండగా అర్చకులకు వేతనాలు చెల్లించాలని ఆదేశాలు జారీ చేసిన హైకోర్టు ఎండోమెంట్ భూములకు అర్చకుల వేతనాలకు, తాతల పేర్ల మీద ఉన్న భూములకు సంబంధం లేదని పేర్కొంది. అర్చకత్వం కింద వారికి వేతనాలు ఇవ్వాలని, ఆలయ భూములకు సంబంధించి కలెక్టర్ వద్ద తేల్చుకోవాలని సూచించినా అర్చకులకు వేతనాలు ఇవ్వకుండా ఉన్నతాధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇదిలా ఉండగా అర్చకుల తాతల పేర్ల మీద ఉన్న ఆలయ భూములను దేవాదాయ శాఖకు స్వాధీనం చేస్తామని అర్చకులు హామీ ఇచ్చినా ఎండోమెంట్ అధికారులు జీతాలు ఇవ్వకుండా ఐదేళ్లుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని అర్చకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హైకోర్టు తీర్పును అమలుచేయాలి



ఐదేళ్లుగా వేతనాలు ఇవ్వడంలేదు. వేతనాలు ఇవ్వాలని హైకోర్టు తీర్పు ఇచ్చినా ఎండోమెంట్ ఉన్నతాధికారులు పట్టించుకోవడంలేదు. దీనిపై మరోసారి హైకోర్టును ఆశ్రయిస్తాం. శ్రీవేణుగోపాలస్వామి ఆలయ భూములు మా పేరు మీద ఉన్నట్లుగా తప్పుగా రికార్డుల్లో రాశారు. విచారణ చేయకుండా అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. జీతాలు నిలిపివేసి మమ్మల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. తాత, ముత్తాతల పేరుతో ఉన్న భూములతో సంబంధం లేదు. దేవాదాయ శాఖ అధికారులు పూర్తి విచారణ చేసి వేతనాలు మంజూరు చేయాలి.

- నరగిరినాథుని మురళీచార్యులు

నిర్ణయం ఉన్నతాధికారుల పరిధిలో ఉంది



అర్చకుల వేతనాల విషయం రాష్ట్ర ఎండోమెంట్ అధికారుల పరిధిలో ఉంది. వేణుగోపాలస్వామి ఆలయ భూమి మొత్తం అర్చకుల పేర్ల మీద ఉంది. గతంలో ఎవరు పొరపాట్లు చేశారో ఎలా చేశారన్న విషయం నా పరిధిలో లేదు. 2009కి ముందు కొన్ని రికార్డులు లేవు. శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ రికార్డులు ఉన్నా శ్రీవేణుగోపాలస్వామి దేవాలయ భూముల విషయంలో గందరగోళం జరిగింది.

- కొండారెడ్డి, ఈవో

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య



రాజు(ఫైల్)

సూర్యాపేట క్రైం, సెప్టెంబరు 3 : ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆలస్యంగా వెలుగుచూసింది. పట్టణ ఇన్‌స్పెక్టర్ జీ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని హైటెక్‌బస్టాండ్ సమీపంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన కోడిమళ్ల రాజు(25) ప్రైవేట్‌ఉద్యోగం చేస్తున్నాడు. అయితే కుటుంబంలో కొంతమేర ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి. దీంతో మనస్తాపంతో ఈ నెల 1వ తేదీన సాయంత్రం ఇంటి నుంచి బయటకువెళ్లాడు. కుటుంబ సభ్యులు రాత్రి సమయంలో రాజుకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. మరుసటి రోజు కుటుంబసభ్యులు రాజు ఆచూకీ కోసం బంధుమిత్రుల వద్ద ఆరా తీశారు. దీంతో సమాచారం లేకపోవడంతో సోమవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదుచేశారు. అయితే మంగళవారం సాయంత్రం సద్దులచెరువులో మృతదేహం తేలి ఉండటాన్ని గమనించిన మత్స్యకారులు పోలీసులకు సమాచారమిచ్చారు. రాజు మృతదేహంగా కుటుంబ సభ్యులు గుర్తించారు. రాజు తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపారు.

పాము కరిచి రైతు మృతి



శంకరయ్య(ఫైల్)

ఆలేరు రూరల్, సెప్టెంబరు 3: వ్యవసాయ పనులు చేస్తుండగా పాము కరిచి రైతు మృతి చెందాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని కొలనుపాక గ్రామంలో జరిగింది. కొలనుపాక గ్రామానికి చెందిన బొడ్డు శంకరయ్య(47) సోమవారం సాయంత్రం వ్యవసాయ పనులు చేస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. చికిత్స కోసం అతడిని ఆలేరులోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడని ఎస్‌ఐ రజినికర్ మంగళవారం తెలిపారు. శంకరయ్యకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉండగా భార్య, కుమారుడు మృతి చెందారు. ఇద్దరు కుమార్తెలకు వివాహాలయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి..



సత్తయ్య(ఫైల్)

చండూరు, సెప్టెంబరు 3 : డోజర్ వాహనం డ్రైవర్ నిర్లక్ష్యంతో వృద్ధుడు మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చండూరు పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తాస్కానిగూడెం గ్రామానికి చెందిన రైతు వర్కాల సత్తయ్య(65) తన భార్య యాదమ్మతో కలిసి చండూరుకు బైకుపై వస్తున్నాడు. చండూరు శివారులోని శ్మశానవాటిక వద్ద రోడ్డు పక్కన ఉన్న పిచ్చిమొక్కలను తొలగిస్తున్న డోజర్ వాహన డ్రైవర్ నిర్లక్ష్యంతో వాహనాన్ని వెనక్కి నడిపించడంతో అదే సమయంలో బైక్‌పై వస్తున్న సత్తయ్యతో పాటు భార్య యదమ్మకు ఢీకొని బలమైన గాయాలన్నాయి. ఇద్దరిని నల్లగొండలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సత్తయ్య మృతి చెందాడు. సత్తయ్య కుమార్తె పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకన్న తెలిపారు.

వేర్వేరు చోట్ల విద్యుదాఘాతానికి ముగ్గురు మృతి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో విద్యుదాఘాతంతో ముగ్గురు మృతి చెందారు. నల్లగొండ జిల్లాలో ఇద్దరు, సూర్యాపేట జిల్లాలో ఒకరు మృతి చెందారు. అందులో రైతు, వ్యవసాయ కూలీతో పాటు యువకుడు ఉన్నారు.

దామరచర్ల, సెప్టెంబరు 3 : విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామశివారులో మంగళవారం జరిగింది. ఎస్‌ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వీర్లపాలెం గ్రామానికి చెందిన పాతులోతు హాతి(25) విద్యుత్ స్తంభాలను ఏర్పాటుచేసే కాంట్రాక్టర్ వద్ద సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో కొండ్రపోల్ శివారులో విద్యుత్ స్తంభాన్ని గుంతలో దింపి పైకి ఎత్తిన అనంతరం పలుగుతో సరైన దిశలో తిప్పుతున్న క్రమంలో పైనుంచి వెళ్తున్న 11కేవీ విద్యుత్ తీగలకు స్తంభంపైన ఉన్న ఇనుప చువ్వ అంచు తగిలి విద్యుత్ సరఫరా జరిగి హాతి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే తోటి కార్మికులు 108 వాహనంలో మిర్యాలగూడకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. హాతికి భార్య అఖిల, మూడు సంవత్సరాల కుమార్తె, ఏడాది వయస్సున్న కుమారుడు ఉన్నారు. హాతి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవి తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం హాతి మృతదేహాన్ని మిర్యాలగూడ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సాయానికి వెళ్లి విద్యుత్‌తెగిపడి రైతు...



వెంకటయ్య (ఫైల్)

కొండమల్లేపల్లి: నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం చిన్నఅడిశర్లపల్లిలో విద్యుత్ తీగలు తెగిపడి కార్మికుడు మృతి చెందాడు. ఎస్‌ఐ రాంమూర్తి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామానికి చెందిన రైతు రావుల వెంకటయ్య(52) స్థానిక శివగణేష్ కాటన్‌మిల్లుకు పనినిమిత్తం సాయంత్రం నాలుగు గంటలకు వెళ్లాడు. ఈ క్రమంలో మిల్లులో కార్మికులు ఉండే గదిలో విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా అక్కడే ఉన్న వెంకటయ్యను నిచ్చెన పట్టుకోమన్నారు.ఈక్రమంలో విద్యుత్ తీగలు తెగి వెంకటయ్యపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య అలివేలు, కుమారుడు రమేష్, కుమార్తె అనిత ఉన్నారు.

కొనసాగుతున్న ఆందోళన

మిల్లు యజమాని నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని వెంకటయ్య కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. మిల్లులో మృతదేహాన్ని ఉంచి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ ధనుంజయ్య, కొండమల్లేపల్లి, పీఏపల్లి ఎస్‌ఐలు రాంమ్మూర్తి, నర్సింహులు బాధితులకు నచ్చజెప్పి ప్రభుత్వ పరంగా న్యాయం జరిగేలా చూస్తామని చెప్పినా వారు వినలేదు. మిల్లు యజమాని వచ్చే వరకు ఇక్కడి నుంచి వెళ్లబోమని తేల్చిచెప్పారు. వెంకటయ్య బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా రాత్రి పొద్దుపోయే వరకు ఆందోళన కొనసాగుతోంది.

వాటర్‌హీటర్ పెడుతుండడగా వ్యవసాయ కూలీ..

అనంతగిరి: సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలంలోని వాయిలసింగారంలో విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందింది. ఎస్‌ఐ నవీన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వాయిలసింగారం గ్రామానికి చెందిన చలకపల్లి చిలకమ్మ(32) వ్యవసాయ కూలీ పనులు చేస్తుంటుంది. చిలకమ్మ మంగళవారం ఉదయం వరినాట్లకు వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చి స్నానం చేసేందుకు వాటర్‌హీటర్ పెడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. చిలకమ్మ భర్త సత్యనారాయణ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తుండగా చిలకమ్మ కూలీ, నాలీ పనులు చేసుకుంటూ జీవిస్తుందని ఎస్‌ఐ తెలిపారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. చిలకమ్మ మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సులో ఆగిన గుండె

ఆస్పత్రికి తీసుకెళుతుండగా అస్వస్థత



బస్ సీట్‌లోనే ఒరిగిన యాదమ్మ

అర్వపల్లి, సెప్టెంబరు 3: వైద్య పరీక్షలు చేయించుకునేందుకు బయలుదేరిన మహిళ ఆర్టీసీ బస్సులోనే గుండెపోటుతో కన్నుమూసింది. అప్పటిదాకా తమ పక్కన కూర్చున్న మహిళ మృత్యువాత పడడంతో బస్సులోని ప్రయాణికులంతా నిర్ఘాంతపోయారు. మంగళవారం సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలంలో ఈ ఘటన జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా నాగారం మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన జటంగి యాదమ్మ (55)కు సోమవారం రాత్రి ఛాతిలో నొప్పిరావడంతో కుటుంబసభ్యులు గ్రామంలోనే ప్రథమ చికిత్స చేయించారు. మంగళవారం ఉదయం వైద్య పరీక్షల కోసం సూర్యాపేటలోని ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు తమ గ్రామం నుంచి ఆటోలో ఫణిగిరి స్టేజీ వద్దకు తీసుకొచ్చారు. అదే సమయంలో జనగామ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రావడంతో యాదమ్మ, ఆమె కుటుంబ సభ్యులు బస్సు ఎక్కారు. కొంతదూరం రాగానే మార్గమధ్యలో యాదమ్మకు ఆయాసం ఎక్కువైంది. మంచినీరు కావాలంటూ అడిగింది. ఆ సమయంలో ఆర్టీసీ బస్సు జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లికి రాగానే యాదమ్మ కూర్చున్న సీట్లలోనే గుండెపోటుతో మృతి చెందింది. యాదమ్మ పక్కనే భర్త అవిలయ్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులున్నారు. అయితే ఆర్టీసీ డ్రైవర్ బస్సును ఆపి అర్వపల్లికి చెందిన ఆటోలో యాదమ్మ మృతదేహాన్ని తరలించారు.విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వచ్చి పోస్టుమార్టం చేయించాలని చెప్పగా, కుటుంబసభ్యులు వద్దని వాదించారు. అయినా సరే పోలీసులు పంపించాలనడంతో యాదమ్మ మృతదేహాన్ని గంటపాటు ఆటోలోనే ఉంచారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆర్టీసీ బస్సులో యాదమ్మ మృతి చెందడంతో కుమార్తెల రోదనలు చూసిన స్థానికులు కంటతడి పెట్టారు. యాదమ్మ కూలి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తోంది. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్వపల్లి ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు.

కస్తూర్బా పాఠశాలను తరలించాలి

ఆదర్శపాఠశాల విద్యార్థినుల ఆందోళన ● ఎమ్మెల్యే హామీతో నిరసన విరమణ





విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఆరుబయట విద్యార్థులు

వేములపల్లి, సెప్టెంబరు 3 : తమ హాస్టల్ నుంచి కస్తూర్బా పాఠశాలను వేరేచోటుకు తరలించి సమస్యలను పరిష్కరించాలని నల్లగొండ జిల్లా వేములపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థినులు మూడు గంటల పాటు ఆందోళన చేశారు. ప్రధానగేట్ వద్ద కూర్చుని లోనికి ఎవరూ వెళ్లకుండా ఆందోళన చేయడంతో అంతసేపు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆరుబయటే ఉండిపోయారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 100 మంది విద్యార్థుల వసతికి నిర్మించిన హాస్టల్‌లోకి మాడ్గులపల్లి కస్తూర్బా పాఠశాలల విద్యార్థినులు 350మందిని తరలించడం సమంజసం కాదన్నారు. కొద్దిరోజులుగా సుమారు 450 మంది విద్యార్థినులు ఒకేచోట ఇరుకైన గదుల్లో ఉంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. రెండు రోజులుగా వర్షాలతో, నీటి సరఫరా సరిగా లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. పలుమార్లు అధికారులు కస్తూర్బా పాఠశాలను వేరేచోటుకు తరలిస్తామని రాతపూర్వకంగా హామీ ఇచ్చినా అమలుచేయలేదన్నారు. విషయం తెలుసుకున్న ఎంఈవో బాలాజీనాయక్ రెండు రోజులు గడువు ఇవ్వాలని, మిర్యాలగూడకు తరలిస్తామని కోరారు. అందుకు విద్యార్థినులు ససేమిరా అంటూ ఆందోళన కొనసాగించారు.

మూడు గంటలు ఆరుబయటే

ఆదర్శ పాఠశాల విద్యార్థినులు ఉదయం అల్పాహారం చేసిన వెంటనే పాఠశాల ప్రధాన గేటు దగ్గరకు వేసి 9గంటల సమయంలో ఆందోళనకు దిగారు. అప్పటి నుంచి పాఠశాలలోకి విద్యార్థిని, టీచర్లను అనుమతించలేదు. దీంతో వారంతా 3గంటల పాటు రోడ్డు వెంట చెట్ల కింద కూర్చున్నారు. అక్కడకు చేరుకున్న కేవీపీఎస్ రాష్ట్ర నాయకుడు రెమడాల పరుశురాములు విషయాన్ని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా అక్కడికి చేరుకున్న ఎమ్మెల్యే విద్యార్థినులతో మాట్లాడి వినాయకచవితిలోగా కస్తూర్బా పాఠశాలను తరలించి సమస్యలు పరిష్కరిస్తామని నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

రేషన్‌బియ్యం పట్టివేత

దేవరకొండ, సెప్టెంబరు 3: నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం జేత్యతండాలో అక్రమంగా నిల్వ చేసిన ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నర్సింహులు మంగళవారం తెలిపారు. తండాకు చెందిన కోట్యానాయక్ రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఐ రమేష్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చండూరు రూరల్ : నల్లగొండ జిల్లా చండూరు మండలం గుండ్రపల్లి అక్రమంగా నిల్వచేసిన 11క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గుండ్రపల్లి గ్రామానికి చెందిన వందనపు నరేందర్ తన ఇంట్లో రేషన్ బియ్యం నిల్వచేసినట్లు సమాచారం మేరకు మంగళవారం పోలీసులు తనిఖీలు చేశారు. నిల్వ చేసిన 11 క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించి సీజ్ చేసి నరేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకన్న తెలిపారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 3 : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, స్వామికి నిత్యపూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి చెంత ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం జరిపిన అర్చకులు సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. సహస్రనామ పఠనాలతో 1000 తమలపాకులతో నాగవల్లీ దళార్చనలు చేపట్టారు. ప్రధానాలయంలోని స్వయంభువులను సుప్రభాతసేవతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, సుదర్శన నారసింహహోమం, నిత్యతిరుకల్యాణోత్సవ పర్వాలను నిర్వహించారు. పాతగుట్ట ఆలయం, విష్ణుపుష్కరిణి, కొండపైన శివాలయంలోని ఆంజనేయస్వామిని ఆరాధిస్తూ అర్చకులు ప్రత్యేకపూజలు చేపట్టారు. కొండపైన శివాలయంలో రామలింగేశ్వరస్వామికి ముఖమండపంలోని స్ఫటికమూర్తులకు నిత్యపూజలు, నిత్యరుద్రహవనం కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.21,09,091 ఆదాయం సమకూరగా అందులో లీజుకు సంబంధించినవి రూ.5,81,181 ఉన్నట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.



ఆంజనేయస్వామికి హారతి ఇస్తున్న అర్చకుడు

చెర్వుగట్టుపై ఘనంగా లక్ష పుష్పార్చన

నార్కట్‌పల్లి : అమావాస్య తిథిని పురస్కరించుకుని నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని శైవక్షేత్రం చెర్వుగట్టు శ్రీపార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం రాత్రి లక్ష పుష్పార్చన వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను తిలకించేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలి వచ్చారు. తొలుత ప్రధానాలయం నుంచి మంగళ వాయిద్యాల నడుమ ఉత్సవమూర్తులను మహామండపానికి చేర్చారు. ఆలయ ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ, సహఅర్చకులు లక్ష పుష్పార్చనను కన్నుల పండువగా నిర్వహించారు. స్వామి వారి చెంత పూజలందుకున్న పూలను తీసుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. కార్యక్రమంలో ఈవో నవీన్‌కుమార్, దేవస్థాన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు

నాటి జాగ్రత్తతో... నేడు ముంపు

నడిగూడెం, సెప్టెంబరు 3: ఖమ్మం జిల్లా వాసుల తాగునీటి అవసరాల కోసం వేసవిలో తీసుకున్న జాగ్రత్త భారీ వర్షాల సమయంలో నాగార్జునసాగర్ ఎడమకాల్వ గండికి కారణమైంది. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం కాగిత రాంచంద్రాపురం వద్ద ఎడమకాల్వకు భారీ గండి పడేందుకు ఎన్నెస్పీ అధికారుల నిర్లక్ష్యమే కారణమని రైతులు ఆరోపిస్తున్నారు. గండిపడిన ప్రాంతంలో అత్యవసరంగా తెరవాల్సిన ఎస్కేప్‌ను తెరవకపోవడంతో ప్రమాదం చోటుచేసుకుంది. వేసవిలో ఖమ్మం జిల్లా వాసులు తాగునీటి అవసరాల కోసం ఏప్రిల్‌లో సాగర్ ప్రాజెక్ట్‌లోని నీటిని ఎడమకాల్వ ద్వారా పోలీస్‌పహారా మధ్య ఖమ్మం జిల్లాకు తరలించారు. ఆ సమయంలో కాల్వ పొడవునా ఉన్న ఎస్కేప్, ఎత్తిపోతలు, మేజర్లు, మైనర్ల తూములన్నింటినీ అధికారులు పోలీసుల సహకారంతో మూసివేయించారు. రైతులు ఎవరూ తూములు తెరవకుండా షట్టర్లు కిందికి దించి తెరుచుకోకుండా వెల్డింగ్ చేయించారు. నీటి విడుదల నిలిపివేశాక అధికారులు వాటిని పట్టించుకోలేదు.



కాగితరాంచంద్రాపురం వద్ద ఎడమకాల్వపై ఎస్కేప్ వద్ద తూములకు చేసిన వెల్డింగ్ (రౌండప్‌లో)

భారీ వర్షాలకు ఒత్తిడి పెరిగి...

వర్షాలకు ఎడమకాల్వలోకి భారీగా వరద చేరడంతో పాటు సాగర్ ప్రాజెక్ట్ నుంచి కాల్వకు నీటివిడుదల కొనసాగుతుండటంతో కాల్వలపై ఒత్తిడి పెరిగింది. దీంతో మూడు రోజుల కిందట సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం కాగితరాంచంద్రాపురంలోని ఎడమకాల్వపై 132, 133 కిలోమీటర్ల వద్ద రెండు చోట్ల భారీగా గండ్లు పడ్డాయి. వేసవిలో తూములు, ఎస్కేప్‌లకు వేసిన వెల్డింగ్‌లు తీసివేయించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారు. దీంతో ఎడమకాల్వ ద్వారా నీరు చేరుకునే పాలేరు వాగు బ్యాక్ వాటర్ వెనక్కి రావడం, కాల్వలో నీటి ఉధృతి ఉండటంతో గండ్లు పడ్డాయి. వరద సమయంలో ఎస్కేప్ తెరవాలన్న ప్రయత్నాలు కూడా చేయకపోవడంతో గండ్లుపడ్డాయని రైతులు ఆరోపిస్తున్నారు. సాగర్ నీళ్ల వదిలాక తూములు వెల్డింగ్ తొలగించి అవి పనిచేసేలా చూడాలని రైతులు, అధికారులను కోరినా నిర్లక్ష్యం చేశారు. ప్రధానంగా ఖమ్మం, సూర్యాపేట జిల్లాల ఎన్నెస్పీ అధికారుల మధ్య సమన్వయం లోపంతో ప్రమాదం సంభవించిందని ఇరుజిల్లాల రైతులు ఆరోపిస్తున్నారు. కాల్వకు నీటిని విడుదల చేస్తున్న సమయంలోనే వెల్డింగ్‌లను తీయాలని సూచించినా పట్టించుకోలేదని రైతులు విమర్శిస్తున్నారు. ఫలితంగా కాల్వకు గండితో పాటు రెండు వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా గండిపడి మూడు రోజులైనా పాలేరు, ఎడమకాల్వకు మంగళవారం నాటికి నీటి ఉధృతి తగ్గినా ఎస్కేప్, తూములను ఎత్తకపోవడం గమనార్హం. వెల్డింగ్‌లు తొలగించి తూములు ఎత్తాలంటే ఎన్నెస్పీ అధికారుల పర్యవేక్షణలోనే జరగాల్సి ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎస్కేప్‌కు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఎస్కేప్ తెరిచి ఉంటే...

ఎడమకాల్వపై నడిగూడెం మండలం కాగితరాంచంద్రాపురం వద్ద 132-133 కిలోమీటర్ రాయి మధ్య రెండు చోట్ల గండ్లు పడ్డాయి. గండిపడిన ప్రదేశానికి కిలోమీటరు దూరంలోనే ఎస్కేప్ ఉంటుంది. అయితే కాల్వలో నీటి ఉధృతి పెరిగినా, అనుకోని ప్రమాదం జరిగినా ఈ ఎస్కేప్‌ను అధికారులు తెరుస్తుంటారు. ఎస్కేప్ తెరిచి ఉంటే నీరంతా పిల్ల కాల్వ ద్వారా సమీపంలోకి ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయకన్‌గూడెంలోని వాగులోకి చేరుతుంది. అక్కడి నుంచి ఈశ్వర్‌మాదారం, రాజాపేట తదితర గ్రామాల ద్వారా ఆయా ప్రాంతాల్లోని వరద వాగుల గుండా మున్నేరు వాగులోకి చేరుకుంటుంది. అదేవిధంగా ఈ కాల్వ ద్వారా వెళ్లే నీటిని సమీపంలోని రైతులు పొలాలకు మళ్లించుకునేవారు. తద్వారా నీటి వృథా తగ్గడంతో పాటు కాల్వపై ఒత్తిడి తగ్గి ఉండేది. గండ్లు పడే అవకాశం లేకుండాపోయేది.

ఆలస్యంగా గండి వెలుగులోకి...

హుజూర్‌నగర్: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పరిధిలోని సాగర్ ఎడమకాల్వ ముక్త్యాల 13వ బ్రాంచ్‌కెనాల్‌కు గండిపడిన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ నెల 1వ తేదీన గండి పడగా అధికారులు ఆలస్యంగా గుర్తించారు. 14వ కిలోమీటర్ వద్ద 30మీటర్ల వెడల్పున కాల్వ కట్టకు గండిపడింది. మునగాల హెడ్‌రెగ్యులేటర్ నుంచి వచ్చే కాల్వకు కుడివైపున గండి పడడంతో హుజూర్‌నగర్ మండలంలోని కరక్కాయలగూడెం ప్రాంతంలోని పొలాలు నీటమునిగి ఇసుక మేటలు వేశాయి. ఈ వరద ప్రవాహం కరక్కాయలగూడెం, మగ్రిగూడెం ప్రాంతాల మీదుగా బూరుగడ్డలోని నల్లచెరువుకు వరద రావడంతో చెరువు కట్ట తెగింది. దీంతో సుమారు 500ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ఇదిలా ఉండగా 13వ బ్రాంచ్ కెనాల్‌పై రెండు రోజుల కిందట 18వ కిలో మీటర్ వద్ద కాల్వ లైనింగ్ కొట్టుకుపోయింది. దీంతోపాటు 22వ కిలో మీటర్ వద్ద పంట పొలాల నుంచి వచ్చిన వరద ప్రవాహంతో రెండు చోట్ల కాల్వకు గండ్లు పడ్డాయి. మొత్తంగా మూడుచోట్ల గండిపడింది.



నక్కలగండి రిజర్వాయర్‌కు భారీగా వరద



రిజర్వాయర్‌లోకి దుందుభి నది వరద, అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, సెప్టెంబరు 3: నాగర్‌కర్నూల్ జిల్లాలో భారీ వర్షాలతో దుందుభి నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో దిగువన ఉన్న నల్లగొండ జిల్లా చందంపేట మండలంలోని నక్కలగండి రిజర్వాయర్‌లోకి భారీగా వరదనీరు చేరుతోంది. దీంతో నక్కలగండి, పాతతెల్‌దేవరపల్లి, దేవరచర్ల, యలమలమంద, బొల్లారం గ్రామాలు, తండాలకు భారీగా వరదనీరు చేరి పత్తి పంటలు మునిగిపోయే పరిస్థితి నెలకొంది. రిజర్వాయర్‌లోకి నీరు చేరడంతో అధికారులు దిగువ భాగానికి గేట్లు ఎత్తివేసి నీటిని విడుదల చేస్తున్నారు. ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ మంగళవారం రిజర్వాయర్‌ను సందర్శించి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వరదనీరు తండాల్లోకి వెళ్లకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. వరద బాధితులను పరిహారంతో పాటు అన్నివిధాలా ఆదుకుంటామన్నారు. ఆయన వెంట ఆర్డీవో శ్రీరాములు, నీటిపారుదలశాఖ, రెవెన్యూ అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

టెయిల్ పాండ్ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

దామరచర్ల : ఎగువన నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ 26 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్న నేపథ్యంలో నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలంలోని టెయిల్‌పాండ్‌కు మంగళవారం భారీఎత్తున నీరు వచ్చిచేరింది. దీంతో అధికారులు 11 గేట్లను ఐదు మీటర్లు, ఒక గేట్‌ను 2 మీటర్లు ఎత్తి 2,92,950 క్యూసెక్కుల నీటిని దిగువ పులిచింతల ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

ఈ నష్టం తీరనిది



హుజూర్‌నగర్ గోవిందాపురంలోని ప్రాథమిక పాఠశాలలో నీటిని తొలగిస్తున్న మునిసిపల్ సిబ్బంది

హుజూర్‌నగర్, సెప్టెంబరు 3: హుజూర్‌నగర్ పట్టణంలోని గోవిందాపురంలో ప్రభుత్వ పాఠశాలలోకి భారీగా వరద నీరు వచ్చింది. భారీ వర్షాలతో ముత్యాలమ్మ చెరువు అలుగు నుంచి వచ్చిన వరదతో ప్రభుత్వ పాఠశాల మొత్తం నిండింది. మూడు రోజులుగా మోకాళ్ల లోతులో నీరు నిల్వ ఉంటోంది. పాఠశాలను తెరిచేందుకు ఉపాధ్యాయులు మంగళవారం వచ్చారు. నీరు నిల్వ ఉండడంతో మునిసిపల్ అధికారులకు సమాచారం ఇచ్చి సిబ్బందితో తొలగింపజేశారు. సుమారు 60 గంటల పాటు పాఠశాల గదుల్లో నీరు ఉండడంతో గోడలు మొత్తం తడిసి ముద్దయ్యాయి. పాఠశాలలో 40మంది విద్యార్థులు ఉండగా మంగళవారం నలుగురు విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. ఆ నలుగురినీ వంట కోసం కేటాయించిన రేకుల షెడ్డులో కూర్చోబెట్టి పాఠాలు బోధించారు. ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్న గోవిందాపురం పాఠశాలలో మూడు తరగతి గదులు ఉన్నాయి. 50ఏళ్ల క్రితం ఈ తరగతి గదులు నిర్మించారు. కాగా పాఠశాల శిథిలావస్థకు చేరుకోవడంతో గత ఏడాది ప్రభుత్వం రూ.18లక్షలు కేటాయించింది. పాఠశాలకు స్థలం లేనందున ఉన్న తరగతి గదులు కూల్చి అదే స్థలంలో కొత్తగా గదులు నిర్మించాలని కోరినప్పటికీ, అధికారుల నిర్లక్ష్యంతో నిర్మించలేదు. భారీ వర్షాలతో పాఠశాల పైకప్పు నుంచి కూడా నీరు కారింది.

మండల వ్యాప్తంగా అపార నష్టం

మేళ్లచెర్వు: భారీ వర్షాలు, వరదల కారణంగా ఉమ్మడి మండల వ్యాప్తంగా వరి, పత్తి, మిర్చి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మేళ్లచెర్వు మండల వ్యాప్తంగా వరి 800ఎకరాలు, పత్తి600 ఎకరాలు, చింతలపాలెం మండలంలో వరి 300ఎకరాలు, పత్తి505 ఎకరాలు, మిర్చి355 ఎకరాల్లో పూర్తి దెబ్బతిందని వ్యవసాయాధికారులు ప్రాథమిక అంచనా వేశారు. వరద ఉధృతికి పంట పొలాల్లో ఇసుక మేటలు వేయడంతో దెబ్బతిన్నాయి. ఏపుగా ఎదిగిన పత్తి, పూత, కాయ దశలో నీటిలో నానినందున నష్టం వాటిల్లింది.

▸▸ దెబ్బతిన్న పంటలు ▸▸ ధ్వంసమైన రోడ్లు

పునరుద్ధరించని ఆర్టీసీ బస్సులు

వరదలకు ముందు కోదాడ నుంచి మేళ్లచెర్వు మండల కేంద్రం మీదుగా చింతలపాలెం, చింత్రియాల గ్రామాలకు నడిచే పల్లె వెలుగు బస్సులు ఈ నెల రెండో తేదీ నుంచి బంద్ చేశారు. హుజూర్‌నగర్ నుంచి మండల కేంద్రానికి గతంలో కూడా బస్సు సౌకర్యం లేనందున ప్రైవేట్ ఆపరేటర్లు ఇష్టారీతిన ప్రయాణికుల నుంచి అధిక మొత్తంలో డబ్బు వసూలు చేసేవారు. ప్రస్తుతం బస్సులు రద్దు చేసిననందున ప్రజలు అదేవిధమైన అసౌకర్యానికి గురవుతున్నారు. కోదాడ నుంచి మండల కేంద్రాలకు వచ్చే పల్లె వెలుగు సర్వీసులను హుజూర్‌నగర్ నుంచి పునరుద్ధంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.



మేళ్లచెర్వులో పత్తి చేనులో వేసిన ఇసుక మేటలు

భారీ వర్షాలకు జిల్లాలో వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. వాగులు, చెరువులు పొంగి పొర్లడంతో రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. పలు మండలాల్లో రోడ్ల కోతకు గురికావడంతో రవాణా బంద్ అయింది. పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరగడం, విద్యుత్ తీగలు తెగడంతో విద్యుత్ శాఖకు భారీ నష్టం వాటిల్లింది. కోదాడ నియోజకవర్గంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే పద్మావతి పర్యటించి బాధితుల్లో ధైర్యం నింపారు. పంట నష్టంపై అంచనా వేసి నివేదిక పంపాలని వ్యవసాయాధి కారులను ఆమె ఆదేశించారు. పలు గ్రామాలను ఆర్టీసీ బస్‌లను పునరు ద్ధరించనందున ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

● ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్

చెరువులకు గండ్లు



వర్షానికి కొట్టుకుపోయిన అలుగునూరు గ్రామ రహదారి

నూతన్‌కల్: భారీ వర్షాలతో వచ్చిన వరదలతో చెరువులకు గండ్లు పడడంతో పాటు గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. మండలంలోని అలుగునూరు గ్రామానికి ఒకే రహదారి ఉంది. అది కూడా వరదలకు కొట్టుకుపోవడంతో ఆ గ్రామానికి రాకపోకలు నిలిచాయి. గ్రామస్థులు వివిధ ప్రాంతాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

● మండలంలోని మాచనపల్లి గ్రామానికి చెందిన రైతులు తమ పశువులను పాలేరు వాగు పక్కన ఉన్న పశువుల చావిడిలో కట్టేశారు. వరదలకు ఉప్పుల ఉప్పలయ్య, ఉప్పుల గంగయ్య, వేల్పుల ఉప్పలయ్య, బొల్క లింగయ్యకు చెందిన ఏడు పశువులు మృతిచెందాయి. వాగుకు అవతల వైపున కట్టేసిన నిమ్మనగోటి పుల్లయ్య, అంజయ్య, మల్లయ్యకు చెందిన ఆరు కాడెడ్లను మరిపెడ మండలం మూలమర్రి తండాకు చెందిన 15మంది గిరిజనులు ప్రాణాలకు తెగించి కాడెడ్లను ప్రాణాలతో కాపాడారు. పంటలకు పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

గాలివానకు విరిగిన విద్యుత్ స్తంభాలు

ఆత్మకూర్(ఎస్): మూడు రోజులుగా ఉరు ములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తు న్నందున మండలంలోని బొప్పారం తండాలో 10 విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. దీంతో వ్యవసాయ మోటార్లకు మూడు రోజుల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రైతులు పొలాల వద్దకు వెళ్లి విద్యుత్ స్తంభాలు విరిగినట్లు, విద్యుత్ తీగలు తెగినట్లు గుర్తించారు. మండలంలో చెరువులు, కుంటలు అలుగు పోస్తున్నాయి. అధికారులు స్పందించి వెంటనే మరమ్మ తులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



బొప్పారంలో కూలిన విద్యుత్ స్తంభాలు

మద్దిరాల: వర్షాలకు పత్తి నేలకు ఒరిగింది. పెసర పంటలు నల్లగా బూజు పట్టాయి. వరి పొలాలు మధ్యలో ఉన్న గట్లు చెదిరిపోయాయి. కొన్ని చోట్ల నీటి ప్రవాహానికి వరి పొలాలు నేలమట్టమయ్యాయి.

వ్యక్తిని కాపాడిన గ్రామస్థులు

తుంగతుర్తి: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని కేశవాపురం వద్ద ఉన్న బంధం వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నందున కేశవపురం వెలుగుపల్లి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచాయి. కేశవాపురం గ్రామానికి చెందిన పడిశాల కుటుంబరావుకు మంగళవారం ఉదయం తేలు కుట్టింది. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి వెళదామంటే బంధం వాగుతో రవాణా సౌకర్యాలు నిలిచిపోయాయి. స్థానికులు కర్ర కావలికి జోల కట్టి కుటుంబరావును భుజాలపై మోస్తూ బంధం వాగును దాటించి తుంగతుర్తిలోని ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్యం చేయించి ప్రాణం కాపాడారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ వర్షాకాలంలో బంధం వాగు ఉప్పొంగితే అత్యవసరం నిమిత్తం ఊరు దాటి బయటకి వెళ్లే పరిస్థితి లేదన్నారు. బంధం వాగుపై వంతెన నిర్మించాలని పలుమార్లు ప్రజాప్రతినిధులకు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.



తేలు కుట్టిన వ్యక్తిని వాగు దాటిస్తున్న కేశవాపురం గ్రామస్థులు

విద్యుత్‌శాఖకు రూ.50లక్షల ఆస్తి నష్టం



రాఘవాపురంలో కూలిన ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభం

పాలకవీడు: భారీ వర్షాలకు పాలకవీడు మండలంలో విద్యుత్‌శాఖకు రూ.50లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు ట్రాన్స్‌కో ఏఈ నర్సింహనాయక్ తెలిపారు. వేములూరి వాగుపై చెర్వు కట్టలు తెగినందున రాత్రికి రాత్రే వరదలు వచ్చాయన్నారు. ఈ వరదలకు 50 విద్యుత్ స్తంభాలు, 10ట్రాన్స్‌ఫార్మర్లు, 5 కిలోమీటర్ల మేర విద్యుత్ తీగలు ధ్వంసమయ్యాయన్నారు. ఈ. నష్ట పరిహార నివేదికను తయారుచేసి ఉన్నతాధికారులకు పంపుతామన్నారు.

కృష్ణానది పరవళ్లు

పాలకవీడు: మండలంలోని మహంకాళిగూడెం, రావిపహాడ్ గ్రామాల నుంచి ప్రవహిస్తున్న కృష్ణానది పరవళ్లు తొక్కుతోంది. కృష్ణానది మీద ఉన్న నాగార్జునసాగర్ గేట్లు ఎత్తి సుమారు 3లక్షల క్యుసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఈ నేపథ్యంలో కృష్ణా నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పాలకవీడు ఎస్ఐ లక్ష్మీనర్సయ్య హెచ్చరించారు. కృష్ణానదీ పరవళ్లను మండల ప్రజలు ఆస్వాదిస్తున్నారు.



మహంకాళిగూడెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణానది



నేరేడుచర్ల - గంటవారిగూడెంలో దెబ్బతిన్న కల్వర్టు

నేరేడుచర్ల: భారీ వర్షానికి మండలంలోని గంటవారిగూడెం నుంచి నేరేడుచర్లకు వచ్చే రహదారి పూర్తిగా ధ్వంసమైంది. కాల్వపై సిమెంటు గూనలు వేసి మట్టిపోసి రోడ్డు వేయడంతో వర్షం వచ్చిన సమయంలో చెత్త చెదారం మొత్తం ఆ గూనల్లో ఇరుక్కుంది. పంట పొలాల్లోని నీటితో పాటు ఎస్ఎస్పీ కాల్వ నీరు భారీగా రోడ్డుపై ప్రవహించినందున రోడ్డు మొత్తం తింది. దీంతో గంటవారిగూడెం, తెలగరామయ్యగూడెం గ్రామాల ప్రజలు నేరేడుచర్లకు చుట్టూ తిరిగి రావాల్సి వస్తోంది.అధికారులు స్పందించి వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టడంతో పాటు వంతెనను నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

కోదాడ టౌన్: భారీ వర్షాల కారణంగా నష్టపోయిన వారికి ప్రభుత్వం అండగా ఉండి ఆదుకుంటుందని ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. మంగళవారం పట్టణంలోని షిరిడిసాయినగర్, శ్రీరంగాపురంలో ముంపు ప్రాంతాలను అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. దెబ్బతిన్న ఇళ్లను, వాహనాలను పరిశీలించి బాధితులకు ధైర్యం కల్పించారు. ఇళ్లు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ఆస్తి నష్టాన్ని అధికారులతో అంచనా వేయించి పరిహారం అందజేస్తామన్నారు. ధ్వంసమైన రోడ్ల పునరుద్ధరణకు వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. త్వరలోనే పట్టణంలో రూ.450కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీని నిర్మిస్తామన్నారు. పలువురు బాధితులు ఎమ్మెల్యేతో తమ సమస్యలను చెబుతూ కన్నీటి పర్యంతమయ్యారు. ఎమ్మెల్యే వెంట మునిసిపల్ చైర్మన్ సామినేని ప్రమీల, వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, 18వ వార్డు కౌన్సిలర్ కర్రి శివసుబ్బారావు, కమిషనర్ రమాదేవి, కంబాల రంగా, కంబాల ప్రసాద్, చావా హరినాథ్, ఆలేటి రాంబాబు, మట్టపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మునిసిపాలిటీలో సమస్యలను పరిష్కరిస్తా

కోదాడ మునిసిపాలిటీలోని పలు వార్డులో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. పట్టణంలోని భారీ వర్షాలకు దెబ్బతిన్న కాలువలు, డ్రైన్లు, డివైడర్లను ఎమ్మెల్యే పరిశీలించి మాట్లాడారు. శ్రీమన్నారాయణ కాలనీలో 21వ వార్డు బీసీ హాస్టల్ పరిధిలోని 150ఇళ్లు నీట మునిగాయని, విలువైన వాహనాలు, ఇళ్లలోని సామాన్లు దెబ్బతిన్నాయని ఎమ్మెల్యేకు స్థానికులు వివరించారు. ఆక్రమణకు గురైన పంట కాలువను సర్వే చేయించి వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని ఎమ్మెల్యేకు వార్డు ప్రజలు కోరగా, కాల్వకు మరమ్మతులు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



కోదాడలో ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

ప్రతి కుటుంబాన్ని ఆదుకుంటాం

కోదాడ రూరల్,చిలుకూరు, అనంతగిరి: భారీ వర్షాలకు కోదాడ నియోజకవర్గంలో నష్టపోయిన ప్రతి కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. కోదాడ, అనంతగిరి మండలాల్లో ఆమె పర్యటించారు. పంటల నష్టంపై వ్యవసాయాధికారులు 24 గంటల వ్యవధిలో అంచనా వేసి ఆ నివేదికను తనకు అందజేయాలని ఆదేశించారు. తమకు ప్రభుత్వం అందజేసే ఎకరానికి రూ.10వేల నష్టపరిహారం సరిపోదని, అదనంగా ఇప్పించాలని రైతులు ఎమ్మెల్యేను కోరారు. రోడ్లుకు మరమ్మత్తు చేయిస్తామని, అవసరమైన ప్రాంతాల్లో కొత్త విద్యుత్ స్తంభాలు నాటిస్తామని ఎమ్మెల్యే తెలిపారు పేర్కొన్నారు. విద్యుత్ స్తంభాలు విరిగిపోయిన చోట కొత్తవి ఏర్పాటుచేస్తామని తెలిపారు.

● వర్షాలతో నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఎమ్మెల్యే పద్మావతి విజ్ఞప్తి చేశారు. వర్షాల కారణంగా కోదాడ నియోజకవర్గంలో ఇళ్లు కూలి, పంటలు కొట్టకుపోయిన, నిరాశ్రయులైన అనేక మందిని ఆదుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి సహాయ, సహకారాలు అందించాలని కోరారు.

●చిలుకూరు మండలంలోని నారాయణపురం గ్రామంలో తెగిన చెరువు కట్టను, తెగిన రోడ్డును ఎమ్మెల్యే పరిశీలించారు.. ఊరచెరువు కట్ట, దూద్యా తండా, నారాయణపురం రోడ్డుకు మరమ్మత్తులు చేయిస్తామన్నారు. తదనంతరం బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆమె వెంట ఆర్డీఓ సూర్యనారాయణ, తహసీల్దార్ ధ్రువకుమార్, ఎంపీడీవో గిరిబాబు ఉన్నారు.

● అనంతగిరి మండలంలోని చనుపల్లి, కిష్టాపురం, గోండ్రియాల వరద బాధిత కుటుంబాలను ఆమె పరామర్శించారు. పలు వరద ప్రభావ ప్రాంతాల్లో ఆమె పర్యటించి బాధితులకు భరోసా కల్పించారు. ఎమ్మెల్యే వంఎట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బుర్రా సుధాపుల్లారెడ్డి, తహసీల్దార్ హిమబిందువు, ఎంపీడీవో సుష్మ, ఏఈ కీర్తిరెడ్డి ఉన్నారు.

ప్రవీణ్‌కుమార్‌కు కన్నీటి వీడ్కోలు



ప్రవీణ్‌కుమార్ మృతదేహం

ఆత్మకూర్(ఎస్), సెప్టెంబరు 3: అమెరికాలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ స్విమ్మింగ్ పూల్‌లో పడి మృతి చెందిన ఆత్మకూర్(ఎస్) మండలం పాతర్లపహాడ్ గ్రామానికి చెందిన తప్పి ప్రవీణ్‌కుమార్ మృతదేహం 11రోజుల తర్వాత స్వగ్రామానికి వచ్చింది. ప్రవీణ్ కుమార్ అంత్యక్రియలను మంగళవారం నిర్వహించారు. ప్రవీణ్‌కుమార్ మృతదేహాన్ని స్వగ్రామానికితీసుకురావడానికి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు కేంద్ర మంత్రి బండి సంజయ్ సహకరించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పాతర్లపహాడ్ గ్రామానికి చెందిన తప్పి నాగయ్యకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉంది. మృతుడు ప్రవీణ్‌కుమార్ చిన్న కుమారుడు. ప్రవీణ్‌కుమార్ ఎమ్మెస్సీ చేసి హైదరాబాద్‌లో పలు విద్యాసంస్థల్లో ఉపాధ్యాయుడిగా పనిచేశాడు. పదేళ్ల క్రితం అమెరికాకు వెళ్ళిన ప్రవీణ్‌కుమార్ ఆగస్టు 23వ తేదీన ప్రమాదశాత్తు స్విమ్మింగ్‌పూల్‌లో పడి మృతి చెందాడు.

వీరన్న మృతి బాధాకరం: మాజీ ఎమ్మెల్యే

సూర్యాపేట(కలెక్టరేట్), సెప్టెంబరు 3: వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మాజీ ఉద్యోగి మాండన్ వీరన్న మృతి బాధాకరమని మాజీ ఎమ్మెల్యేగాదరి కిశోర్‌కుమార్, రాజ్యసభ మాజీ సభ్యుడు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తెలంగాణ వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మాండన్ సుదర్శన్ తండ్రి వీరన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో బీఆర్ఎస్ నాయకులు వై. వెంకటేశ్వర్లు, గండూరి ప్రకాష్, నెమ్మాది భిక్షం, జీడి భిక్షం, చింతలపాటి చినశ్రీరాములు, బండారు రాజా, మీలా వంశీ, మోత్కూరి సందీప్, కల్లెట్లపల్లి శోభన్‌బాబు, ముదిరెడ్డి అనిల్‌రెడ్డి, రాంమూర్తి తదితరులు ఉన్నారు.

అయ్యప్ప దేవాలయంలో వైభవంగా 16రోజుల పండుగ

నేరేడుచర్ల, సెప్టెంబరు 3: పట్టణంలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి దేవాలయంలో 16 రోజుల పండుగను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితుడు ఇరువంటి సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేకాభిషేకాలు, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. పూజా కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన చర్యలు తీసుకోవాలి

తిరుమలగిరి, సెప్టెంబరు 3: ఖమ్మంలో వరద బాధితులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేయడానికి వెళ్లిన మాజీ మంత్రుల వాహనాలపై రాళ్లతో దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. బీఆర్ఎస్ నాయకులపై దాడులు చేయించడం సిగ్గుచేటని అన్నారు. ఈ ఘటన ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు.

చెరువులు మరమ్మతులు చేయాలి

హుజూర్‌నగర్ రూరల్, సెప్టెంబరు 3: వర్షాలకు తెగిన చెరువులు, కుంటలకు మరమ్మతులు చేయాలని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి కోరారు. భారీ వర్షాలకు గండిపడిన మండలంలోని గోపాలపురం, బూరుగడ్డ గ్రామాల్లో చెరువులు, కుంటలను పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే చెరువులకు మరమ్మతులు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. ఎకరానికి రూ.30వేల నష్టపరిహారం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాజారావు, నర్సింహారావు, బాలసైదులు, సుందరయ్య, సాయికుమార్ పాల్గొన్నారు.

రుణమాఫీ కాని రైతులు దరఖాస్తు చేసుకోవాలి

నేరేడుచర్ల, సెప్టెంబరు 3: పంట రుణాలు మాఫీ కాని కుటుంబ నిర్ధారణ కోసం వెంటనే దరఖాస్తు చేసుకోవాలని హుజూర్‌నగర్ వ్యవసాయ సహాయ సంచాలకుడు రవి కోరారు. నేరేడుచర్ల వ్యవసాయ కార్యాలయంలో కొనసాగుతున్న కుటుంబ నిర్ధారణ నమోదు ప్రక్రియ దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. నియోజకవర్గంలో కుటుంబ నిర్ధారణ చేసుకోవాల్సిన రైతులు 9061మంది ఉన్నారని, వీరిలో 4500 మంది రైతులు కుటుంబ నిర్ధారణ చేసుకున్నట్లు తెలిపారు. మిగిలిన రైతులు గ్రామాలకు వచ్చే వ్యవసాయ అధికారులకు లేదా మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో దరఖాస్తులు ఇచ్చి నమోదు చేసుకోవాలన్నారు. వర్షానికి వ్యవసాయ కార్యాలయం కురుస్తోందని, వ్యవసాయాధికారి జావిద్ ఆయన దృష్టికి తేగా ఉన్నతాధికారులకు తెలియజేస్తాన్నారు. భారీ వర్షాలకు మండలంలో ఎంత పంట నష్టం వాటిల్లింది అనే వివరాలను వ్యవసాయాధికారిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఈవోలు నాగరాజు, అన్వేష్, నిర్మల, స్నేహ తదితరులున్నారు.



దరఖాస్తులు పరిశీలిస్తున్న ఏడీఏ రవి

కూచిపూడి గ్రామస్థులను ప్రభుత్వం ఆదుకోవాలి

కోదాడ రూరల్, సెప్టెంబరు 3: వర్షాలకు భారీగా నష్టపోయిన మండలంలోని కూచిపూడి గ్రామస్థులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆ గ్రామ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శెట్టి సురేష్ నాయుడు అన్నారు. వరదల కారణంగా గ్రామంలో నష్టపోయిన 200మంది కూలీల కుటుంబాలకు భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదలకు, రైతులకు ప్రభుత్వం అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో శెట్టి చంద్రయ్య, శెట్టి రమేష్, శెట్టి నర్సింహారావు, శెట్టి వెంకట్, ఆకుల గోపి పాల్గొన్నారు.

వారోత్సవాలను ప్రభుత్వం నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గన్నా చంద్రశేఖర్

హుజూర్‌నగర్ రూరల్, సెప్టెంబరు 3: తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ కోరారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 11, 12, 13 తేదీల్లో జిల్లాలో సాయుధ పోరాట వారోత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భూస్వాములు, దొరలకు నిజాం రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం చేసిన అమరవీరుల ఆశయాలు సాధించాలన్నారు. రాష్ట్రంలో తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగువేల మంది పోరాట యోధులు ప్రాణాలు కోల్పోయారని ఆయనఆవేదన వ్యక్తం చేశారు. కమ్యూనిస్టుల త్యాగాలను గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో యల్లావుల రాములు,శ్రీనివాస్, నారాయణరెడ్డి, గుండు వెంకటేశ్వర్లు, పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



పెన్‌పహాడ్: గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ పెరక రవీందర్ తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఈనెల 7వ తేదీ నుంచి జరగనున్న గణేష్ నవరాత్రోత్సవాలు సందర్భంగా ప్రతి గ్రామం నుంచి ఉత్సవ కమిటీ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకువాలన్నారు.

● పెన్‌పహాడ్ మండలంలోని 29గ్రామ పంచాయతీలకు చెందిన ఓటరు జాబితాలు సిద్ధంగా ఉన్నాయని ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ఈ జాబితాను ఈనెల 6వ తేదీ నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఉంచుతామని, అభ్యంతరాలు ఉంటే గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఈనెల 13వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

గరిడేపల్లి: అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులను చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి శ్యాంసుందర్‌ప్రసాద్ అన్నారు. మండలంలోని గరిడేపల్లి, పొనుగోడు, రామచంద్రాపురం పంచాయతీ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మౌలానా, పంచాయతీ కార్యదర్శులు నాగేశ్వరరావు, సైదా, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

● ఆశ్రీ ఫౌండేషన్ నిర్వాహకులు కందుల ప్రపూర్ణ, రామకిషోర్ రెడ్డిల కూమార్తె పూర్విక రామ్‌రెడ్డి పుట్టిన 9వ నెలను పురస్కరించుకొని. గరిడేపల్లి జడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాల్లో 200మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్లు, మిఠాయిలను పంచి పెట్టారు.

కోదాడ రూరల్: మండలంలోనికూచిపూడి గ్రామంలో వరద బాధితులకు తమ్మర, కోదాడ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

తిరుమలగిరి: బీసీ గణన చేసి స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంప్రభు డిమాండ్ చేశారు. బీసీ కులగణన చేపట్టాలని బీసీ హిందూ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్ పటేల్ చేపట్టిన ఆమరణ నిరాహారదీక్షకు, మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో మల్లయ్య, బ్రహ్మం, పత్తెపురం యాదగిరి, పాల్గొన్నారు.

● తిరుమలగిరిలోనే బస్‌డిపో నిర్మించడం అందరికి సౌలభ్యమని, ప్రజాప్రతినిధులు, అధికారులు సానుకూలంగా స్పందించాలని బస్‌డిపో సాధన కమిటీ అధ్యక్షుడు కడెం లింగయ్య కోరారు. బస్ డిపో సాధన సమితి అధ్వర్యంలో హైదరాబాద్‌లో ఆర్టీసీ అసిస్టెంట్ డైరెక్టర్ సైదులుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చిర్రబోయిన హన్మంతు, నాగరాజు, లింగయ్య, నాగేష్, లక్ష్మయ్య, లింగయ్య పాల్గొన్నారు.

నూతన్‌కల్: ప్రతి విద్యార్థికి ప్రాథమిక స్థాయిలోనే కనీస సామర్థ్యాలు నేర్పించాలని ఎంఈవో రాములునాయక్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రాథమిక స్థాయి కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్పీలు, సీఆర్పీలు వీరస్వామి, జానకిరాములు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన్‌కల్: మండలంలోని ఎర్రపహాడ్ గ్రామానికి బస్‌లు రాకుండా 365జాతీయ రహదారిపై వెళుతున్నందున ఇబ్బందిపడుతున్నా మని పలువురు తెలిపారు. ఎర్రపహాడ్ నుంచి చందుపట్ల, ముకుందాపురం, జి.కొత్తపల్లి గ్రామాలకు వెళ్లాలంటే కిలోమీటరు దూరం నడిచి వెళ్లాల్సి వస్తోందని ప్రజలు, ఉపాధ్యాయినులు తెలిపారు. అధికారులు స్పందించి గ్రామాల నుండి బస్సులు వెళ్లేల చర్యలు తీసుకోవాలన్నారు

మద్దిరాల: ప్రతి విద్యార్థికి ప్రాథమిక స్థాయిలోనే చదవడం రాయడం అనర్గళంగా వచ్చే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల నోడల్ అధికారి తండు వెంకటనారాయణ అన్నారు. మండలంలోని గోరెంట్ల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రాథమిక స్థాయి కాంప్లెక్స్ సమావేశాలకు హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం బి.రమేష్, సీఆర్పీలు నవీన్, ఉపేందర్, ఆర్పీలు నాగయ్య, విష్ణుకుమార్, శ్రీనివాస్, సత్యనారాయణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● మద్దిరాల మండలంలోని కుక్కడం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బీసు నర్సయ్య(61) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. నర్సయ్య మృతదేహంపై కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లుయాదవ్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలోపచ్చిపాల వెంకన్న, ఏలేటి శ్యాంరెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.

మద్దిరాల: వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి అన్నారు.వర్షాలకు గుమ్మడవెల్లి గ్రామంలో గండిపడిన చెరువును పరిశీలించి మాట్లాడారు. అర్హులందరికీ పరిహారం అందజేస్తామన్నారు.ఈ. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, ఐబీ డీఈ హరికృష్ణ, ఏపీవో గుండు వెంకన్న, రైతులు మాన్‌సింగ్, వెంకన్న, మల్లయ్య, సైదులు పాల్గొన్నారు.

తుంగతుర్తి: మండలంలోని వరద బాధితులను ఆదుకోవాలని బీఆర్ఎస్ నాయకుడు గుండగాని రాములుగౌడ్ అన్నారు. మానాపురం - రావులపల్లి గ్రామాల మధ్య తెగిన రోడ్డును పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కేతిరెడ్డి గోపాల్‌రెడ్డి, తునికి సాయిలు, లకావత్ దశరథ, బానోత్ సుధాకర్, కన్నెబోయిన ప్రసాద్, మనోజ్ పాల్గొన్నారు.